www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 17 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8

## నేడు సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభ

**-పాత బస్టాండ్ నుంచి ఎర్ర కవాత్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభ బుధవారం ఖమ్మం జెడ్పి మీటింగ్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఈనెల 11వ తేదీన ప్రారంభమైన వార్షికోత్సవాలు జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో నిర్వహించడం జరిగిందన్నారు. ఉద్యమానికి బాసటగా నిలిచిన పల్లెల్లో సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు సాయుధ పోరాట యోధుల స్తూపాలు, విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. నాటి వీరుల త్యాగాలను, సాయుధ పోరాటం నాటి తెలంగాణ పరిస్థితులను సాయుధ పోరాటం తీసుకు వచ్చిన మార్పులు, సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం జరిగిందని సురేష్ తెలిపారు. పలు మండలాల్లో సాయుధ పోరాట సభలు నిర్వహించడం జరిగిందని ముగింపు సభను బుధవారం జెడ్పి మీటింగ్ హాల్‌లో జరుగుతుందని ఈ సందర్భంగా పాత బస్టాండ్ నుంచి రెడ్ షర్ట్ ధరించిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల ఎర్ర కవాత్ ఉంటుందని సురేష్ తెలిపారు. వార్షికోత్సవ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు తో పాటు వివిధ వర్గాల ప్రముఖులు, పార్టీ నాయకులు హాజరవుతారని సురేష్ తెలిపారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు





**- నియోజవర్గ ప్రజలందరికీ సమన్యాయం**
**- మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం**
**- ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో కూనంనేని**
**- 615 మందికి పట్టాలు అందజేత**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తామన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రంమలో కూనంనేని మాట్లాడారు. పోరాటాలు చేసి ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపామని, ఇప్పుడు మీ అందరి అభిమానంతో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ఎంపికయ్యాయని చెప్పారు. ఈ ప్రాంత సమస్యల కోసం, ప్రజల ప్రయోజనాలు, మేలు కోసం అనునిత్యం తపిస్తున్నామని, అసెంబ్లీలోసైతం ప్రజా సమస్యలను పెద్ద ఎత్తున లేవనెత్తి ప్రాంతాలకు అతీతంగా మాట్లాడుతున్నట్లు చెప్పారు. కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వంతో పలుమార్లు చర్చించి వీలైనన్ని నిధులు తీసు కొస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే

మిగతా 2లో..

# నేడు ప్రజా పాలన దినోత్సవం

**-హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటలకు పరేడ్ మైదానంలో కార్యక్రమం మొదలవుతుంది. ఉదయం 10 గంటలకు మల్లు భట్టివిక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఆ తర్వాత భట్టి విక్రమార్క ప్రసంగించనున్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలిస్తారు.

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేయండి

**- బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయండి**
**- రైతులకు యూరియా సరఫరా చేయండి**
**- కేంద్ర మంత్రులతో తుమ్మల భేటి, వినతి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కేంద్రంగా గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ఏర్పాటు, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు తెలంగాణ రాష్ట్రానికి సరిపడా యూరియా అందించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్రమంత్రులను కోరారు. మంత్రి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పౌర విమానాశ్రయశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖామంత్రి హెచ్‌డి కుమారస్వామి, ఎరువురు రసాయనాల శాఖా మంత్రి అనుప్రియను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరుపున వినతి పత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలో మొదట చూసిన భూమి అనువుగా లేనందున మరో ప్రాంతంలో భూమిని చూశామని, త్వరగా ఫీజుబులిటీ సర్వే చేసి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. విమానాశ్రయం ఏర్పాటు వల్ల భద్రాచలం రామాలయ దర్శనానికి దేశ విదేశాల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉందని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కొత్తగూడెం జిల్లాలో సింగరేణి, బిఎల్‌తో పాటు కేటిపిఎస్,

మిగతా 2లో..

**రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యంగా**

# జాతీయ మహాసభలు




**-21 నుంచి 25 వరకు ఛండిఘర్‌లో**
**సిపిఐ జాతీయ మహాసభలు**
**-సిపిఐ నేత బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రమాదంలో ఉన్న రాజ్యాంగాన్ని పరిరక్షించడం, సామాజిక న్యాయం లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 25వ మహాసభలు జరుగుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు పంజాబ్‌లోని ఛండీఘర్‌లో జరగనున్న మహాసభల్లో దేశంలోని ప్రధాన సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం గిరిప్రసాద్ భవన్‌లో మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ పోరాడుదాం ప్రజలు గెలుస్తారు సత్యం, న్యాయం జహిస్తుంది అనే నినాదంతో మహాసభలు జరగనున్నాయని ఆయన తెలిపారు. దేశం నలుమూలల నుంచి ఈ మహాసభకు 800 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని హేమంతరావు తెలిపారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడి

మిగతా 2లో..

# చిరస్మరణీయ చారిత్రక ఘట్టం

**-పోరాట కొనసాగింపే సరైన వారసత్వం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చిరస్మరణీయ చారిత్రక ఘట్టం. ప్రపంచ చరిత్రలో సామాన్య ప్రజలు సాధించిన అపూర్వ విజయమది. ఒక బలవంతమైన రాజును ఎదిరించి సాయుధులై పోరాడి గద్దె దించిన ఘట్టమిది. తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటం ఒక ప్రత్యేక పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభ ఏఐటియుసి పిలుపు మేరకు జరిగింది. గ్రామాల్లో భూస్వాములు, జమీందార్లు, జాగీర్‌దార్లు, పటేళ్లు, పట్వారీల దౌర్జన్యాలతో పాటు వీరికి అండగా నిజాం ప్రభుత్వం అరాచకాలు శృతిమించింది. అదే సమయంలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తెలంగాణకు స్వాతంత్ర్యం రాకపోవడం నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రాజుగా ప్రకటించుకోవడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అదే సమయంలో వచ్చిన సాయుధ పోరాట పిలుపును అందుకుని పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. సాయుధ పోరాటం ప్రజల్లో ఒక గొప్ప మార్పును తీసుకు వచ్చింది. జన జీవితంలో వచ్చిన ఈ మార్పుతో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో లక్షలాది ఎకరాల భూమి కమ్యూనిస్టుల సొంతమైంది. నాలుగువేల గ్రామాలు జమీందారి, జాగీర్‌దారి వ్యవస్థల నుంచి విముక్తి కావడంతో పాటు పది లక్షల ఎకరాల భూమి ప్రజల సొంతమైంది. సాయుధ తెలంగాణ పోరాటం కేవలం నైజాం నవాబును గద్దె దించేందుకే పరిమితం కాలేదు. తెలంగాణలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకు వచ్చింది. భూమి విలువను ప్రపంచానికి చూపెట్టింది. సామాన్యుడు సైతం తలెత్తుకు బతికేలా చేయడంతో పాటు పోరాటం ద్వారానే హక్కుల సాధన అనే అంశాన్ని ఎజెండాపైకి తెచ్చిన మహోత్తర ఘట్టమది. 78 ఏళ్ల తర్వాత కూడా ఒక చారిత్రిక పోరాటంతో దేశంలో విలీనమైన తెలంగాణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వాలు ఎందుకు జంకుతున్నాయో అర్థం కాదు. ఒక చారిత్రిక ఘట్టాన్ని ప్రజల ముందు ఉంచడంతో పాటు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. సాయుధ పోరాటం నాటి పరిస్థితులు నేడు లేకపోయినా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల దరి చేరకపోవడం, మతోన్మాద శక్తులు మతం పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నం వీటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఒక చారిత్రిక అవసరం ఇప్పుడు ఏర్పడింది. నాటి అమరుల ఆశయాలను కొనసాగిస్తూ నేటి సమస్యలపై సరైన కార్యాచరణతో పరిష్కారానికి కృషి చేయడమే సాయుధ పోరాట వారోత్సవ వేళ అమరులకు ఇచ్చే నివాళి. నాటి ఆశయాలకు అనుగుణంగా సరైన కార్యాచరణతో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పోరాడటమే ఉద్యమ వారసత్వం.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆందర్శంగా నిలపాలనే తపనతో పలు రకాల గ్రాంట్లు ద్వారా నిధులు రాబట్టి మౌళిక సదుపాయాల కల్పనకు వెచ్చిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకాలు అందుదాయని, రాబోయేరోజుల్లో ప్రతీ ఒక్కరికీ మేవు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా 615 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, మున్నుందు విడతల వారీగా మిగిలిన వారికి కూడా అందిస్తామని చెప్పారు. ఇందులో ఎలాంటి రాగద్వేషాలు లేవని, రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హులను గుర్తించిన తర్వాతే పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ ఒక్క కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజాప్రతినిధిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని, నేను మీ ఇంట్లో ఒకనిగా ఉన్నానని, మీకు కష్టం వస్తే, ఆ కష్టం నాకు కూడా వచ్చినట్లె అని తెలిపారు. ఇక్కడికి వచ్చిన తల్లులంతా మీ పిల్లలను బాగా చదివించాలని, కష్టపడి పిల్లలకు చదువులు చెప్పిస్తే భవిష్యత్‌లో వారు ఉన్న స్థానాలకు చేరుకుంటారని, చదువే మీరు పిల్లలకు ఇచ్చే విలువైన సంపద అని అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 వార్డులు, పాల్వంచ మున్సిపాలిటీలకు చెందిన 24 వార్డులకు చెందిన 617 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, ఆర్‌డిఓ మధు, కొత్తగూడెం తహాశిల్దార్లు పుల్లయ్య, డిఎస్‌పి రెహమాన్‌తో పాటు డిఇలు, ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యంగా జాతీయ మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

ఇతరత్రా విదేశీ సమస్యలపై ప్రత్యేక సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పాలస్తీనా, క్యూబా, ఇతర ప్రపంచ దేశాల ప్రతినిధులు, వామపక్ష పార్టీల నేతలు హాజరవుతారని ఆయన తెలిపారు. భారతదేశ రాజ్యాంగం ప్రమాదంలో పడిందని బిజెపి కారణంగా రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నాయని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగ సంక్షోభం, కార్మిక హక్కుల అననం, విద్య, వైద్యం, విదేశీ విధానం తదితర అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు హేమంతరావు తెలిపారు. పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వామపక్ష విస్తృతి చారిత్రిక అవసరంగా సిపిఐ భావిస్తుందని కమ్యూనిస్టు పార్టీ చీలిక వలన కలిగిన నష్టాన్ని అధిగమించేందుకు లోతైన అవగాహనతో వామపక్షాలతో కలిసి ఐక్య కార్యాచరణ దిశగా పనిచేసేందుకు ఈ మహాసభల్లో నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఇదే సందర్భంలో మావోయిస్టు పార్టీతో పాటు ఇతర సాయుధ వామపక్ష పార్టీలు, సాయుధ మార్గ అనుచరులపై పునః పరిశీలన చేసుకుని కమ్యూనిస్టు ఉద్యమం ప్రధాన స్రవంతిలో చేరాలని ఈ సందర్భంగా సిపిఐ విజ్ఞప్తి చేస్తుందని హేమంతరావు తెలిపారు. కార్పొరేట్, మతోన్మాదుల బలమైన బంధం ఈ దేశానికి అత్యంత ప్రమాదకరం కానుందని ఒక వైపు పోగుపడుతున్న సంపద, మరో పక్క అతి పేదరికం అన్నింటికి మించి కేవలం పదుల సంఖ్యలో ఉన్న కార్పొరేట్ వర్గాల వద్ద సంపద పోగుపడటాన్ని సిపిఐ తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన తెలిపారు. ప్రమాదకరమైన మతోన్మాదం పేదల వ్యతిరేకతతో కూడుకున్న కార్పొరేట్లు ఈ దేశానికి ప్రమాదకరమన్నారు. దీనిపై అన్ని పార్టీలు చర్చించాలని సిపిఐ కోరుతుందన్నారు. సంఘటిత పోరాటాలు మాత్రమే మత శక్తులను కార్పొరేట్ శక్తులను అడ్డుకోగలదని సిపిఐ విశ్వసిస్తుందని ఇందుకు అనుగుణంగా మహాసభల్లో చర్చించనున్నట్లు హేమంతరావు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి బాగం హేమంతరావు, దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు జాతీయ మహాసభలకు ప్రతినిధులుగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు హాజరయ్యారు.

# శ్రీనగర్ పంచాయితీని సుందరంగా తీర్చిదిద్దుతాం



**- తుదిదశకు చేరుకున్న అంతర్గతరోడ్ల నిర్మాణం**
**- రూ.50 లక్షలతో బతకమ్మ ఘాట్**
**- రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి రూ.62.5 లక్షల నిధులు మంజూరు**
**- శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో ఎంఎల్‌ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు పూర్తి చేసి శ్రీనగర్ పంచాయితీని సుందరంగా తీర్చిదిద్దుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని శ్రీనగర్ గ్రామ పంచాయితీలో రూ.14.5లక్షల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో పూర్తయిన రోడ్లు, డ్రైన్లను కూనంనేని ప్రారంభించారు. అనంతరం రూ.48 లక్షల ఎస్‌సిపి, ఎన్‌ఆర్ఇడిఎస్ నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి, రూ.50 లక్షలతో చేపట్టనున్న బతకమ్మ ఘాట్ ని నిర్మాణానికి మంగళవారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటి వరకు వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో రోడ్లు, డ్రైన్లు, ప్రధాన రహదారుల నిర్మాణాలు పూర్తి చేశామని, పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. అంతర్గత రోడ్ల సమస్యలను ముందుగానే గుర్తించి నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని అన్నారు. బతుకమ్మ ఘాట్ నిర్మాణం విషయంలో గతంలో నిర్లక్ష్యం జరిగిందని, పండుగ వేళ మహిళల ఇబ్బందులను పరిగణలోనికి తీసుకుని ఘాట్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి నిధులకు సిఫార్సు చేడయం జరిగిందన్నారు. పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మండల నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, దీటి లక్ష్మీ పతి, లగడపాటి రమేష్, తూము చౌదరి, వీరబాబు, కూచిపూడి జగన్, పూనెం శ్రీనివాస్, అధికారులు అంకుబాబు, శిరీష, శ్రీనివాసరావు, రామకృష్ణ, రఘురామయ్య, వెంకటస్వామి, సాంబయ్య, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాష ఎంతో గొప్పది : ఐటిడిఎ పిఓ

**- భాషపై పట్టుకోసం పలు రకాల పోటీలు**




**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలుగు బాష పట్టుకోసం, పవిత్రత కోసం పలు రకాల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా పిల్లల్లో సృజనాత్మకత శక్తి పెంపొందుతుందని, మాతృభాషపై మరింత జ్ఞానం పెరుగుతుందని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్న తెలుగు కవుల మాటలు అక్షర సత్యం అని వ్యాఖ్యానించారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా తెలుగులో నిర్వహించిన వివిధ పోటీల నిర్వహణ సందర్భంగా జరిపిన కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిధిగా పాల్గొని ప్రసంగించారు. పిల్లలు చేసిన ప్రదర్శనల ద్వారా తెలుగు ఎంత గొప్పదో తెలుస్తోందని, తెలుగు భాషలో అందమైన భావం ఉంటుందని, తెలుగు భాషపై పట్టు కోల్పోతున్న నేటి రోజుల్లో తెలుగు పై నిర్వహించిన పోటీలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. అనతరం పలువురు విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిడి మణెమ్మ, అధికారులు విజయలక్ష్మీ, గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, ఏసిఎంఓ రమేష్, రాములు, ఏటిడిఓలు అశోక్ కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

నవభారత్, బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్ వంటి పరిశ్రమలు ఉన్నాయని, విమానాశ్రయం ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తుమ్మల మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కొత్తగూడెం కేంద్రంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నెలకొల్పామని, ఇదే దేశానికే తలమానికం అని, రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాల నుండి వేలాది మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకు విమానసర్వీసులు ఎంతో అవసరం అన్నారు. బయ్యారంలో విలువైన ఇనుక ఖనిజం ఉందని, ఇక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి లభించడంతో పాటు నిరుద్యోగసమస్య కూడా తగ్గుతుందని కేంద్రభారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రి కుమార స్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి ఈ అంశంపై త్వరలోనే సమావేశం అవుదామని కేంద్రమంత్రి తెలిపారు. అనంతరం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖా మంత్రి అనుప్రియను మంత్రి తుమ్మల మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో సరిపడా యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేసిన పంటలు పాడవుతున్నాయని, రబీ సీజన్‌లో రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతీనెలా రెండు లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి వీలైనంత త్వరలో యూరియా సరఫరా చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## టి న్యూస్ ప్రతినిధి కుటుంబాన్ని పరామర్శించిన చంద్రావతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అక్రమ కేసులు బనాయించబడిన టి న్యూస్ ప్రతినిధి వెన్నబోయిన సాంబశివరావు కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకురాలు, మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ కేసులు బనాయించడం సరి కాదని వార్తా సేకరణలో భాగంగా వెళ్లిన వారిపై ఇటువంటి కేసులు నమోదు చేయడం శోచనీయమన్నారు. పోలీసులు తక్షణం కేసును ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## కార్మికునికి అండగా ప్లంబింగ్, శానిటరీ యూనియన్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనారోగ్యంతో మరణించిన కార్మికునికి ప్లంబింగ్, శానిటరీ కార్మికులు అండగా నిలిచారు. తోట వెంకటేశ్వర్లు అనే కార్మికుడు మృతిచెందగా సిపిఐ నగర సమితి సభ్యులు సాధు నాగరాజు, యూనియన్ నేతలు మూలగండ్ల గోపి, దేవా శ్రీను, ఇసారపు వెంకన్న ఆర్థికంగా చేయూతనందించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.

## గిరిజన గ్రామాలను సందర్శించిన ఐటిడిఏ అధికారులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోతెపట్టినగర్, సారపాక శ్రీరాంపురం ఎస్టీ కాలనీ గ్రామ పంచాయితీలలో గిరిజన ఆదివాసీ గ్రామాలు చింతకుంట, శ్రీరాంపురం ఎస్టీ కాలనీ గ్రామాలను మంగళవారం భద్రాచలం ఐటిడిఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు ప్రజలకు కావాలసిన మౌళిక వసతుల వివరాలు అడిగి తెలుసుకునేందుకు వివిధ శాఖల అధికారులు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆ గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. రోడ్డు సుమారు రెండు కిలోమీటర్లు, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, మినీ సబ్ సెంటర్, అంతర్గత రోడ్లు, కరెంటు, గోదావరి మంచినీళ్లు కావాలని ఆ గ్రామాల ప్రజలు వివరించారు. ఆ గ్రామాలకు సరైన సదుపాయలు లేక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. చింతకుంట గ్రామంలో సుమారు 37 కుటుంబాలు, 148 మంది, శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో సుమారు 67 కుటుంబాలు 300మంది ఉంటారని తెలిపారు. మీకు కావలసిన మౌళిక వసతుల వివరాలను ఐటిడిఏ పివోకి పూర్తి స్థాయి నివేదిక ఇస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఐటిడిఏ అధికారి టి మధుకర్, డివై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఐటిడిఏ ఏఈ ప్రసాద్, మోతెపట్టినగర్ అంగన్వాడీ కార్యకర్త అరుణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


## అక్రమ ఇసుక నిల్వ సీజ్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని సోంపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో అక్రమంగా శ్రీగంథం ఫామ్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను మంగళవారం తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్ వీర్రాజు తన సిబ్బందితో కలిసి పంచనామ నిర్వహించారు. అనంతరం అట్టి ఇసుకను గ్రామ పంచాయితీ అధికారులకు అప్పగించారు. అయితే ఈ ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల కోసం కూపన్లు తీసుకున్నా వారే ఈ నిల్వలను అక్రమంగా ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ఇవ్వాలనే ఆదేశాల ఇచ్చిన నేపథ్యంలో మండలంలో పలువురు మాత్రం అక్రమం ఇసుక రవాణాకు మార్గంగా ఎంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# రజాకార్ల గుండెలపై నెత్తుటి సంతకం

-రైతాంగా సాయుధ పోరాటంలో తనికెళ్లది చెరగని ముద్ర
-రజాకార్లను గడగడలాడించినగడల సీతారామయ్య
-అశువులుబాసిన విప్లవ వీరులెందరో..
-తమ్ముడి ఆచూకీకోసం అన్న గడల ముత్తయ్యను చిత్రహింసలు
-గడల సీతారామయ్యకోసం దళితుడి ప్రాణత్యాగం
-నేటికి మానని గాయాలు
-నేడు తెలంగాణ విమోచన దినం



ప్రజాపక్షం/కొణిజర్ల : తెలంగాణ సంస్థానాన్ని ఏలుతున్న నైజాంపాలనను వ్యతిరేకిస్తున్న రోజులవి. తెలంగాణ సాయుధపోరాటం కోసం గ్రామాల్లోని యువకులు తమ ప్రాణాలను కూడా బలిపెట్టి సమసమాజాన్ని స్థాపించాలని కలలుకన్నారు. అందులో భాగంగానే ఆనాడు కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో గడల కృష్ణయ్య , సీతమ్మగార్ల సంతానం మొత్తం సాయుధపోరాటంలో ప్రత్యక్షంగా , పరోక్షంగా భాగమయ్యారు. వీరిలో చిన్న కుమారుడైన గడల సీతారామయ్య అజ్ఞాతంలోకి వెళ్లి సాయుధపోరాటాలు చేపట్టారు. మల్లెల వెంకటేశ్వరరావు దళంలో గడల సీతారామయ్యతోపాటు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తుళ్లూరు సీతారామయ్య, తులశమ్మ దంపతులతోపాటు మరికొందరని కలుపుకొని అజ్ఞాతంలోకి వెళ్లారు. పగటిపూట అడవుల్లో తలదాచుకుంటు రాత్రి సమయాల్లో ప్రజలతో సమావేశమై ప్రజలను చైతన్యపరిచేవాడు. ఉమ్మడి కమ్యూనిస్టుగా ఉన్నప్పుడు మహమ్మద్ రజబ్అలీ , పుచ్చలపల్లి సుందరయ్య, యాసా వెంకటలాలయ్య, పేరసాని అప్పయ్య, దొండపాటి వెంకయ్య, పిన్నం సత్యం , గడల రామకృష్ణయ్య , గడల సుబ్బయ్యలతో సమాలోచనలు జరిపేవాడు. పార్టీ అభివృద్ధి , రైతుకూలీల సమస్యల పరిష్కారానికి కృషిచేశాడు.

### సీతారామయ్యను అంగవస్త్రాలకింద దాచి రజాకార్లకు దొరకకుండా చేసిన గిరిజన మహిళ

ఒకసారి గడల సీతారామయ్య తనికెళ్ల శివారు బోడియాతండాలో ఉన్న సమాచారం అందుకున్న రజాకార్లు తండాను చుట్టిముట్టడించి తండాలోని ప్రతి ఇంటిని జల్లెడపట్టి వెతకడం ప్రారంభించారు. తండాలోని ఓ గిరిజన మహిళ తన అంగవస్త్రాలకింద సీతారామయ్యను దాచిపెట్టి ఆయనను దొరకకుండా చేసింది. దీనినిబట్టి ప్రజల్లో ఆయనకున్న ప్రేమ ఎంతో అర్థమవుతుంది.

### పార్టీ విస్తరణే లక్ష్యం

భారత కమ్యూనిస్టుపార్టీని జిల్లా వ్యాప్తంగా విస్తరింపచేయాలనే లక్ష్యంతో సీతారామయ్య పనిచేశారు. తాలూకా కార్యదర్శిగా ఉన్న సీతారామయ్య తనికెళ్లతోపాటు గణేశ్వరం , బురదరాఘువాపురం , పాపకొల్లు , జూలూరుపాడు , అశ్వాపురం , మణుగూరు , మల్లవరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఎర్రజెండా ఎగురవేసి పార్టీస్థాపించి వారందరిని ఎర్రజెండా నీడకింద పనిచేసేలా చేశారు. గడలసీతారామయ్యను పట్టుకున్న రజాకార్లు ఆయన్ను వీధులగుండా ఈడ్చుకెళుతు గుర్రాలతో తొక్కించి కమ్యూనిస్టులకు సహకరించినవారికి ఇదేగతి పడుతుందని హెచ్చరించారు.

### కమ్యూనిస్టులకు అన్నంపెట్టిన యాసా మాణిక్యమ్మ

రజాకార్లు కమ్యూనిస్టులకోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన సమయంలో తనికెళ్ల శివారు బోడియాతండా పరిసర ప్రాంతాల్లో తలదాచుకుంటున్న సమయంలో గడల సీతారామయ్య తోబుట్టిన చెల్లెలు యాసా మాణ్యిమ్మ తట్టలో వండిన అన్నంతోపాటు బియ్యం , పచ్చళ్లు తీసుకొని అర్థరాత్రి సమయాల్లో పొలాల్లో నడుచుకుంటు వారున్న చోటికెళ్లి ఇచ్చేది. ఆవిధంగా మాణిక్యమ్మ కమ్యూనిస్టులకు సహాయపడింది.

తమ్ముడి ఆచూకీకోసం అన్న గడల ముత్తయ్యను చిత్రహింసలు

తమ్ముడు సీతారామయ్య ఆచూకీకోసం అన్న గడల ముత్తయ్యను పట్టుకెళ్లి రెండుచెట్ల మధ్యలో కాళ్లు చేతులను తాళ్లతో కట్టి చెట్లకు వేలాడదీసి చిత్రహింసలకు గురిచేశారు. ఆచూకీ చెప్పక పోవడంతో తుపాకీ మడిమతో డొక్కలోపొడిచి అతికిరాతకంగా వ్యవహరించినా తమ్ముడిజాడ చెప్పని త్యాగం ముత్తయ్యది. గడల రామకృష్ణయ్య , గడల నర్సయ్య కుటుంబాలు సైతం కమ్యూనిస్టు పోరాటంలో పాలు పంచుకున్నాయి.

### గడల సీతారామయ్యకోసం దళితుడి ప్రాణత్యాగం

తెలంగాణ సాయుధపోరాటం ఉవ్వెత్తున ఎగుస్తున్నరోజులవి. ఆక్రమంలో గడల సీతారామయ్యతో పాటు యమరో 18 మందిని బోనకల్లు మండలం గోవిందాపురం క్యాంపునకు తరలించారు. వారందరిని వరుసగా నిలబెట్టి మీలో గడల సీతారామయ్య ఎవరో బయటకొస్తే అతని ఒక్కడినే కాల్చి మిగతావారందరిని వదలిపెడతామని హుకుంజారీచేశారు. మధిర మండలానికి చెందిన ఓ దళితుడు నేనే గడల సీతారామయ్యను అంటు బయటకొచ్చాడు. వెంటనే ఆదళితుడిని కాల్చి చంపారు. నిజంగా చనిపోయింది. గడల సీతారామయ్య? లేక వేరొక వ్యక్తా అని దానిని నివృత్తి చేసుకునేందుకు శవంమీద బట్టలు సీతారామయ్య ఇంటికి పంపించి కుటుంబసభ్యులను క్యాంపుకురావాలని ఆదేశించారు. చెల్లెలు యాసా మాణిక్యమ్మ గోవిందాపురం క్యాంపుకు వెళ్లింది. అక్కడ అన్న బతికుండటం చూసింది. తన అన్న బతికుండాలంటే చనిపోయిన దళితుడే అన్న అనేవిధంగా శవందగ్గర బోరున ఏడ్చింది. దీంతో నిజంగానే సీతారామయ్య చనిపోయాడని నిర్థారణ చేసుకొని వెళ్లిపోయారు. ఆవిధంగా అన్ననుబతికించుకున్న వీరవనితయాసా మాణిక్యమ్మ

### పోలీస్ స్టేషన్ మెట్లెక్కని తనికెళ్ల ప్రజలు

195657 సంవత్సరంలో తనికెళ్ల చుట్టుప్రక్కల గ్రామాల శాంతిభద్రతల నిమిత్తం తనికెళ్లలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. కాని 1985 వరకు సుమారు 20 సవంవత్సరములవరకు పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎత్తేశారు. తనికెళ్లను సోవియట్ , రష్యా బృందాలు సందర్శించి తనికెళ్లను మిని సోవియట్‌గా అభివర్ణించారు.

### పిన్నం సత్యం త్యాగం అజరామం

తనికెళ్ల సిపిఐ కార్యాలయం సమీపంలో పిన్నం సత్యం ఇల్లు ఉంది. ఆయన



ఇంటి ఎదురుగా చింతచెట్టుకు సిపిఐ జెండా కట్టారు. రజాకార్లు పిన్నం సత్యంను చెట్టుపైనున్న జెండాను విప్పి కిందపడేయాలని ఆదేశించారు. దానికి ఆయన నిరాకరించడంతో వారు ఆగ్రహించి చేతివేళ్లలో సూదులుగుచ్చి కాల్చిచంపుతామని బెదిరించినా ఎదురొడ్డి నిలిచారు. ఆయన ధైర్యాన్ని చూసి వెనుదిరిగిపోయారు.

### గొర్రెలపాలు అందించిన పెద్ద బిక్షం

తనికెళ్ల గ్రామానికి చెందిన కమటాల పెద్ద భిక్షంకు గొర్రల మందలు ఎక్కువగా ఉండేవి. గొర్రెలపాలు సీతారామయ్య దళం నుంచి వచ్చిన వ్యక్తి అందించడంవలన ఆపాలుతాగి మద్యాహ్నంవరకు అన్నం తినకుండా ఉండేవారు.

### రాలిపోయిన ఎర్రమందారం

తనికెళ్ల గ్రామ కమ్యూనిస్టు నిర్మాత. అభివృద్ధిలో చిరస్మరణీయుడు గడల సీతారామయ్య కామెర్ల వ్యాధితో బాధపడుతు 1977 మార్చి 4 న వరంగల్ మహాత్మా గాంధి ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనను ఎడ్లబండిపై కుర్చీలోకూర్చోబెట్టి గ్రామంలోని ప్రతిబజారుకు ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికి సీతారామయ్యకు హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టారు. అంతిమయాత్ర తిరునాళ్లను మరిపించే రీతిలో కొనసాగింది. సీతారామయ్య మరణవార్త విన్నదగ్గరనుంచి ఆయన అంతిమసంస్కారాలు అయ్యేంతవరకు గ్రామంలో ఒక్క పొయ్యివెలిగించలేదు. నేటికి ఆయన గొప్పతనం ప్రజలు చర్చించుకుంటున్నారు.

### తండ్రిబాటలోనే తనయుడు పయనం

గడల సీతారామయ్య తనయుడు గడల భాస్కర్‌రావు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటు సిపిఐ పార్టీ అనుబంధ సంఘంలో పనిచేశాడు. పదవీ విరమణ తర్వాత 2025 జూలై 07 న జరిగిన కొణిజర్ల మండల మహాసభలో ఆయనను మండల పార్టీ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీపట్ల నిబ్బదత కనబరిచిన వ్యక్తి కావడంతో తొలిసారే మండల కార్యదర్శిగా ఎన్నుకోవడం పార్టీపట్ల ఆయనకున్న నిబద్దత తెలుస్తుంది.

## సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు

- నాటి పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి
- విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- కల్లూరి, రావులపల్లి



ప్రజాపక్షం/భద్రాచలం : తెలంగాణ సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ చరిత్రను వక్రీకరిస్తూ సొంతడబ్బా కొట్టుకొంటోందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్ అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక డివిజన్ పార్టీ కార్యాలయంలో అరుణ పతాకాన్ని రవికుమార్ ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆ నాటి మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటి ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అని, ఈ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని బలమైన ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, జమిందారీ, దోపిడీ, అన్యాయాలపై పేద రైతులు, కూలీలు ఏకమైన అలుపెరగని పోరాటాన్ని నిర్వహించారన్నారు. కేంద్రంలోని మోడి సర్కార్ ఈ పోరాటాన్ని హైజాగ్ చేస్తోందని, బిజెపి, ఆర్ఎస్, భజరంగ్ దళ్ వంటి మతతత్వ సంస్థల పాత్ర ఏ మాత్రం లేదన్నారు. ప్రజా,కార్మిక, రైతాంగ,రైతు కూలీల హక్కులు, సామాజిక న్యాయం కోసం నేడు జరుగుతున్న పోరాటాలకు తెలంగాణ సాయుధ పోరాటం ఓ దిక్సూచని, నాటి పోరాట పటిమను పునికిపుచ్చుకుని భవిష్యత్ తరాల్లో చైతన్యం నింపడమే కమ్యూనిస్టు కార్యకర్తల పాత్రని



చెప్పారు. ప్రపంచ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని విలీన దినోత్సవంగా ఎందుకు జరపలేక పోతున్నారో పాలకులు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, అమరుల స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సాయుధ పోరాట నాయకుల పేర్లు ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని, వారు డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ నాయుడు, మహేష్, సీతారామరాజు, ఏఐటీయూసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్, గుంజా రామారావు, చాడ శోభన్‌బాబు, కొక్కిరేణి అశోక్, నారపొంగు ఏసు, ఉమాదేవి, కుమారి, నరేష్ నాయుడు, సూరిబాబు, సంతోష్, కార్తీక్, అజయ్, పవన్, సాయిరామ్, శివ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19న ఛలో గిరిజన సంక్షేమ కమిషనరేట్



ప్రజాపక్షం/కారేపల్లి: గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయడంలో, ఆశ్రమ పాఠశాల, ఉపాధ్యాయులు ఇతర సమస్యల పరిష్కారంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా సమస్యలు సత్వరమే పరిష్కారించాలనే డిమాండ్‌తో ఈనెల 19వ తేదీ శుక్రవారం మాసాబ్ ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత 3 నెలలుగా ప్రమోషన్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, గత సంవత్సరం నుండి అనేక ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కమీషనర్, సెక్రటరీ, మంత్రులకు ప్రాతినిధ్యం చేసినప్పటికీ స్పందన లేకపోవుటచే అనివార్యంగా పోరాటం చేయవల్సి వస్తోందన్నారు. ఇందుకు కమిషనర్ కార్యాలయమే కారణమని అభిప్రాయ పడుతున్నామని, అప్పటికి అధికారులు స్పందించి సమస్యలను పరిష్కారానికి ముందుకు రానిచో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, అందుకు అధికారులే బాధ్యత వహించాల్సిన ఉంటుందని అభిప్రాయ పడ్డారు.

## వెంకటి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామానికి చెందిన గ్రామ పంచాయితీ ట్రాక్టర్ డ్రైవర్ కంచిపోగు వెంకటి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాలోత్ రాందాస్ నాయక్ పరామర్శించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, దశదిన కర్మకు ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మోదుగు రామకృష్ణ, నాయకులు గోలి సిల్వరాజ్, మంద నరసింహారావు, మంద సురేష్, నరపోగు చిన్న నరసింహారావు, మందా రమేష్, మచ్చ లాజర్, తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట యోధుడు కోయ బెబ్బులి సోయం గంగులు



ప్రజాపక్షం/దమ్మపేట: తెలంగాణ చరిత్ర లో ఆదివాసీల పోరాటాలు అపారం, అనన్య సామాన్యం. అనాటి గిరిజనులు భూమికోసం పటేడ్డు అన్నం కోసం, దోపిడి దారుల నుంచి విముక్తి కోసం శ్రమ కు తగిన ఫలితం కోసం అమాయక గిరిజనుల తరుపున పోరాటం చేసిన ఉద్యమాలను చరిత్ర మర్చిపోవటం విచారకరం, అవమానం. అలా మిగిలిపోయిన ఆదివాసి వీరులలో కోయ బెబ్బులి గా పిలిచే సోయం గంగులు దొర ఒకరు. మనుషుల నుండి మహా యోధుడిగా ఎదిగిన ఆ భూమి పుత్రుడే గంగులు దొర. కోయ బెబ్బులిగా ప్రసిద్ధి చెందిన గంగులు నిజాం రాజ్యం లోని దట్టమైన పాల్వంచ (పాత తాలూకా) అటవీ పరిధిలో తిరుగులేని నాయకుడు. ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జమేదారు బంజర అనే కోయగూడెంలో రాముడు పాపమ్మ దంపతులకు 1918లో జన్మించారు. ఫ్యూడల్ భూసంబంధాల సమూల మార్పు కోసం తెలంగాణలో 1946 నుండి 1951 వరకు సాగిన మహోజ్వల సాయుధ పోరాటం ఒక సామాన్యుడిని సాహస యోధుడిగా మార్చింది. గంగులు వ్యక్తిత్వం గానీ, పోరాట నాయకత్వం గానీ, శౌర్యపరాక్రమాలు గానీ, కోయగిరిజనులలో ఆయనపైగల అపార ఆదరాభిమానాలు గానీ ఎవరు సమగ్రంగా అందించలేకపోయారు. గంగులు ఉద్యమ జీవితం మూడు దశల్లో ఉన్నట్టు తెలుస్తోంది. మొదటి దశలో గోదావరి తీరాన పేరంటాలపల్లి వద్ద ఆశ్రమం నిర్మించుకున్న బాలానందస్వామి కనుసన్నల్లో సింగరాజు నాయకత్వంలో నడిచిన నిజాం వ్యతిరేక పోరాటంలో గంగులు దళ నాయకుడిగా కీలక బాధ్యత వహించాడు. అనతి కాలంలోనే కమాండర్ స్థాయికి ఎదిగిన గంగులు 1948 మార్చిలో పాల్వంచ ఏరియాలోకి ప్రవేశించిన కమ్యూనిస్టు దళంలో చేరిపోయాడు. గంగులు పార్టీలో చేరిన తర్వాతే కాస్త చదువుకోవడంతో సిపిఐ కమిటీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు. చురుకైన యువతతో కమిటీలు నిర్మించాడు. కూలీరేట్ల పెంపు, పాలేర్ల జీతాల పెంపు, అక్రమ లెవీ సేకరణకు, అటవీ శాఖ కాజేసే పుల్లర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపాడు. పార్టీలో సెంట్రల్ కమాండర్‌గా ఎదిగాడు.గెరిల్లా దళాల నిర్మాణంలో గంగులు కీలకపాత్ర పోషించడంతో పాల్వంచ జంగల్ పూర్తి కమ్యూనిస్టుల స్థావరంగా మారింది. గంగుల పోరాట ఫలితంగా సువిశాల పాల్వంచ రూపురేఖలు మారాయి. దమ్మపేట కేంద్రంగా ఒక చెట్టు వద్ద ఉద్యమ జెండాను పాతాడు. ఒక ప్రజా కంటక భూస్వామిని అంతమొందించాడు. ఆయన బలీయమైన శక్తులకు భూస్వాములు గూడేలనువదిలి పారిపోయారు. అటవీ, రెవెన్యూ శాఖల జులుం నశించింది. అన్ని శిస్తులు రద్దయ్యాయి. భూమి, అడవిపై హక్కు లభించింది. స్వాతంత్ర్యానంతరం తొలుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా తెలంగాణ మాత్రం భారత యూనియన్‌లో విలీనం కాలేదు. ఈ నేపథ్యంలోనే 1948, సెప్టెంబర్ 13న యూనియన్ ప్రభుత్వం పోలీ సు చర్య పేరిట నిజాం ప్రభుత్వంపై సైనిక దాడికి దిగింది. ఆధునిక ఆయుధాలతో 50 వేల మంది సైనిక బలగాలు జనరల్ చౌదరి నేతృత్వంలో నిజాం భూభాగాన్ని చుట్టుముట్టడంతో 1948, సెప్టెంబర్ 17న నిజాం సర్కార్ లొంగిపోయింది. తెలంగాణలో వెల్లోడి నేతృత్వంలో సైనిక పాలన విధించబడింది. ఏజెన్సీ గూడేల నుండి భూస్వాములు పారిపోయి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ప్రతీకారంగా 1948 నుండి 1951 వరకు యూనియన్ సైనికులు ఇల్లందు, పాల్వంచ, దమ్మపేట, బూర్గంపాడు, వేలేరుపాడు ప్రాంతాల్లోని విప్లవకారులను, సానుభూతిపరులను, సామాన్యులను చిత్రహింసలుపెట్టారు. గంగులును మట్టుబెడితే తప్ప పా ల్వంచ ఏరియాలో ఉద్యమాన్ని అణచలేమని భూస్వాములు, రాజకీయ నాయకులు, పోలీసు, మిలిటరీ భావించింది.అందుకు ఆంధ్రా సరిహద్దులోని జీలుగుమిల్లి (ప.గో) ఆనుకొని ఉన్న పాలచర్లకు చెందిన గంగులు సమీప బంధువైన వొగ్గెల చంద్రమ్మను పావుగా వాడుకున్నారు. ఆమె ఇచ్చిన జీలుగు కల్లు తాగి గంగులు స్పృహ కోల్పోయాడు. అ పరిస్థితులలో ఉన్న గంగులను పిరికితనంగా సైన్యం బంధించి రహస్యంగా దాచింది. పార్టీ రహస్యాలు చెప్పమని గంగులు నుఘోరంగా చిత్రహింసలు పెట్టింది. అయినా ఏ విషయం బయటికి పొక్కలేదు. దమ్మపేటలో గంగులు కట్టిన జెండాను విప్పడానికే దమ్ము చాలని సైనికులు పిరికిగా బంధించి రుద్రాక్షపల్లిలోని రావిచెట్టుకు కట్టివేసి, ఆ వీరున్ని 1951, మే12 న కాల్చిచంపి నిస్సిగ్గుగా ఎదురు కాల్పులుగా చిత్రీకరించారు. గంగులు పోరాట చరిత్ర భవిష్యత్తరాలకు పాఠ్యాంశంగా అందించబడితేనే తెలంగాణ చరిత్రకు సార్థకత.

## సాయుధ పోరాట యోధులు కోర్సా జోగయ్య, పెంటమ్మ దంపతులు

-కష్టాలు ఎదురైనా కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు వీడలేదు
-నాటి ప్రభుత్వం ప్రలోభాలకు గురిచేసిన పట్టుకున్న జెండా వదల్లేదు
-నేటి యువతకు ఆదర్శం జోగయ్య, పెంటమ్మ దంపతులు

ప్రజాపక్షం/సత్తుపల్లి: సాయుధ పోరాట యోధులు కొర్సా జోగయ్య, పెంటమ్మ దంపతులు ఎందరికో ఆదర్శంగా నిలిచారు. కష్టాలు ఎదురైనా, కన్నీళ్ళు చుట్టుముట్టినా, నమ్మిన పార్టీ కోసం, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నాటి ప్రభుత్వాలకు ఎదురొడ్డి బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం 1947 సెప్టెంబర్ 11న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్ధం మొహిద్దీన్ లు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. 1947 ఆగస్టు 15న భారతదేశం మొత్తానికి స్వాతంత్రం వచ్చినా, నైజాం నవాబు పాలనలో ఉన్న హైదరాబాద్ స్టేట్ కు స్వతంత్రం సిద్ధించలేదు. దీనిని గమనించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని కూడా భారతదేశంలో విలనం చేయాలని ప్రారంభమైన పోరాటం నైజాం నవాబు కుయుక్తులను తిప్పికొడుతూ, విరోచితంగా సాగిన సాయుదా పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు వీరులు అమరులైనారు. తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచి, 300 గ్రామాలకు విముక్తి కల్పించింది. 1948 సెప్టెంబర్ 17 ఆనాటి సెంట్రల్ హోమ్ మినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ నాటి నవాబ్ తో చీకటి ఒప్పందం కుదుర్చుకొని, నవాబుకు గవర్నర్ పదవి కట్టబెట్టి తెలంగాణ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేశారు. కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకునిసర్దార్ వల్లభాయ్ పటేల్ , నైజాం నవాబు కుయుక్తులను తిప్పికొడుతూ కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపునందుకున్న సత్తుపల్లి మండలం, యాతాలకుంటకు చెందిన కొర్సా జోగయ్య, పెంటమ్మ దంపతులుసిపిఐ నాయకుడు నల్లమల్ల గిరిప్రసాద్ దళంలో సభ్యులుగా చేరి చురుగ్గా పనిచేశారు. యాతాలకుంట అన్నపురెడ్డిపల్లి అశ్వరావుపేట దమ్మపేట అనంతారం లాంటి అటవీ ప్రాంతాల్లో రహస్యంగా జీవిస్తూ కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ, సాయుధ దళాలతో పాటు తుపాకులు పట్టుకుని రహస్య జీవితాన్ని గడిపారు. ఈ సందర్భంగా జోగయ్య పెంటమ్మ దంపతులపై నాటి ప్రభుత్వం అనేక కేసులు బనాయించి ఏడు సంవత్సరాల పాటు జైల్లో ఉంచింది. కడలూరు, విశాఖపట్నం, రాజమండ్రి, వరంగల్, జైళ్ళ చుట్టూ తిప్పుతు ఆ దంపతులను చిత్రహింసలకు గురిచేస్తూ సహచరుల సమాచారం చెప్పాలని నిలదీసింది. చిత్రహింసలకు చలించకుండా ప్రాణాల అర్పించడానికి సిద్ధమే కానీ తమ సహచరుల సమాచారం చెప్పమని ఎదురొడ్డి నిలిచారు ఈ దంపతులు. అనునిత్యం నరకం చూపిస్తూ,అనేకబ ప్రలోభాలకు గురిచేసి సమాచారం చెప్తే 100 ఎకరాలు భూమి ఇస్తామని ఆశ చూపిన ఏ మాత్రం ఆశపడలేదు కొర్సా జోగయ్య, పెంటమ్మ దంపతులు. తమ బిడ్డలైన ఐదుగురు ఆడ సంతానాన్ని వెంట పెట్టుకుని జైలుకు వెళ్లడానికి సిద్ధపడ్డారు కానీ ఎక్కడ తాము నమ్మిన పార్టీని మాత్రం విడవలేదు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకొని ముందుకు సాగారు ఈ దంపతులు. జైలు నుండి వచ్చిన అనంతరం ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి వేల ఎకరాల భూములను ఈ ప్రాంతంలోని సత్తుపల్లి, అనుపురెడ్డిపల్లి, చెరుకుపల్లి, దమ్మపేట, కిష్టారం, బుగ్గపాడు, తదితర ప్రాంతాలలో వేల ఎకరాల పేదలకు పంచిన చరిత్ర ఈ దంపతులకుంది. ఈ దంపతులు పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తమ జీవితాన్ని అర్పించారు.

### విప్లవ జోహార్లు...

భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన నాటి సాయుధ పోరాటం కొర్సా జోగయ్య, పెంటమ్మ లాంటి ఎందరో త్యాగధనులను అందించింది వారందరికీ విప్లవ జోహార్లు.

## నేటి నుండి స్వస్త్ నారి సశక్త్ పరియార్ అభియాన్ కార్యక్రమం

ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేటి నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్త్ వారి సశక్త్ పరియార్ అభియాన్ కార్యక్రమం జరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ సాయి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ నేడు మంగపేట పిహెచ్‌సి నందు స్పెషలిస్ట్ డాక్టర్లచే మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది. ముఖ్యంగా గైనిక్ సమస్యలు, అంటు వ్యాధులు కానీ బీపీ, షుగర్ కొన్ని రకాల క్యాన్సర్ వంటి సమస్యలకు, అనుమానిత క్షయ అనగా రెండు వారాలకు మించి తెమడతో కూడిన దగ్గు ఆయాసం వంటి జబ్బులకు, కౌమార, మహిళలలో గల రక్తహీనత సమస్యలు, మానసిక రుగ్మతలు కలిగిన మహిళలకు సంబంధించిన, పలు రకాల స్పెషలిస్టు డాక్టర్లచే మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది. అనుమానిత క్షయలో భాగంగా ఊపిరితిత్తుల ఎక్స్‌రే కూడా తీయడం జరుగుతుంది కావున మండలంలో గల ముఖ్యంగా మహిళలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమానికి గాను, గ్రామ స్దాఇయలో ఆశాలు, అంగన్వాడీలు, గ్రామ పంచాయితీ సిబ్బంది, పలు డిపార్ట్మెంట్లు ప్రజలను మోటివేట్ చేసి నేటి క్యాంపుకు హాజరయ్యేలా చేయాలని కోరారు. నేటి స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య శిబిరంను విజయవంతం చేయవలసిందిగా లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులను, ప్రజాప్రతినిధులను, నాయకులను కోరారు.

## ఉగ్రవాది ఇన్‌స్టాలో కొత్తగూడెం యువకుని ఫొటో?

- ఎన్ఐఏ సోదాలు - ధృవీకరించని పోలీసులు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఇటీవల వైజాగ్‌లో పట్టుబడ్డ ఉగ్రవాదుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొత్తగూడెంకు చెందిన ఓ యువకుని ఫొటోలు ఉన్నాయనే సమాచారంతో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. సుమారు పది మంది బృంధం గల ఎన్ఐఏ అధికారులు తెల్లవారుఝామున 4 గం. సమయంలో బస్టాండ్ సమీపంలోని ఓ ఇంటి వద్దకు చేరుకుని చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఉ.10 గం.ల వరకు ఆ ప్రాంతాన్ని తమ ఆదీనంలో ఉంచుకున్న ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ తనిఖీలతో అసలు ఏం జరుగుతుందో అంతుపట్టక స్థానికులు భయాందోళనకు గురైనట్లు తెలుస్తోంది. కాగా పోలీసులు మాత్రం ఎన్ఐఏ దాడులను ధృవీకరించలేదు. ఈ దాడుల్లో ఎవరినైనా అదుపులోనికి తీసుకున్నారా లేదా అనేది తెలియాల్సి ఉండటంతో పాటు అసలు ఈ వ్యవహారంపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ప్రజాపక్షం/అశ్వాపురం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెల్లిపాక బంజరలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న అప్క శంకర్‌ని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ అశ్వాపురం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బట్ట నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు క్రమ శిక్షణ, విలువలు, నాణ్యమైన విద్యను అందిస్తూ భావి భారత పౌరులకు తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్య నారాయణ, కటిబోయినయిన కొండయ్య, ఇర్పా వెంకటేశ్వర్లు, కొమరం రమేష్, కోర్స మల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులకు భోజన వసతి



ప్రజాపక్షం/పాల్వంచ : యూరియా కోసం పాల్వంచ సొసైటీ కార్యాలయానికి వస్తున్న రైతాంగానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ ఉపాద్యక్షులు కాంపల్లి కనకేష్ ఆధ్వర్యంలో మంగళవారం రెండవ రోజు భోజన వసతి ఏర్పాటు చేశారు. దివ్యశ్రీ ప్యూరిఫైడ్ డ్రింకింక్ వాటర్ యాజమాని తోట సతీష్ తాగునీటి వసతి కల్పించారు. ఈ సంధర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్ మాట్లాడుతూ ... ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా అందించడంలో ఘోరంగా విఫలం చెందినదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగ్లోత్ రంజిత్, మారుముళ్ళ కిరణ్, కొత్తచెరువు హర్షవర్థన్, పూజల ప్రసాద్, ఆలకుంట శోభన్, గంగధారి పుల్లయ్య, వల్లపిన్ని వెంకటేశ్వర్లు, పోసారపు అరుణ్, కుమ్మరికుంట్ల వినోద్, గజ్జెల రితిక్, కొండె మనోజ్, కూరెల్లి మురళీమోహన్, ఆలి, సిహెచ్ ప్రవీన్, కొమ్మాలపాటి నిఖిల్, గడ్డం శ్రీకాంత్, తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కిన్నెరసాని గురుకుల పాఠశాల స్వర్ణోత్సవ వేడుకల లోగో ఆవిష్కరణ



ప్రజాపక్షం/పాల్వంచ : స్వరోత్సవ వేడుకల నిర్వాహణ కోసం ఏర్పాటు చేసిన కమిటి సభ్యులు వారికి కేటాయించిన బాద్యతలను పూర్తి నిభద్దతతో నిర్వర్తించి వేడుకలను విజయవంతం చేయటానికి తమ వంతుగా తోడ్పాటునందించాలని రిటైర్డ్ టీచర్ చక్రవర్తి అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలో ఏర్పాటు చేసిన కిన్నెరసాని గురుకుల పాఠశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సంధర్భంగా డిసెంబర్ 28న, జరిగే స్వర్ణోత్సవ వేడుకల లోగోను మంగళవారం పూర్వ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల 50 సంవత్సరాలుగా వేలాది మంది గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్ది ప్రయోజకులను చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, రిటైర్డ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఖాదర్, ఉపాధ్యాయులు ప్రదీప్ కుమార్, వెంకటరత్నం, శ్రీనివాస్ కుమార్, ఎం. సత్యనారాయణ,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ కార్మికులకు న్యాయం చేయాలి



ప్రజాపక్షం/కారేపల్లి: ఉసిరికాయలపల్లి పరిధిలోని సోలార్ కార్మికులు గత కొన్ని సంవత్సరాల నుండి ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఐఎఫ్‌టియు ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ అన్నారు. మంగళవారం బిహెచ్ఈఎల్ యాజమాన్యం కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తుందని, కార్మికులపై కుట్ర పన్నుతున్న యాజమాన్యం అవలంభిస్తున్న వేతనాన్ని తక్షణమే ఉపసంహరించుకొని కార్మికులందరినీ ఉద్యోగాల్లో తీసుకోవాలని ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో శ్యాంబాబు, ప్రేమ్ సింగ్, సంజీవ్‌కుమార్, రాజు కుమార్ బాలు, శంకర్, చిన్న శ్రీను, సైదులు, కళ్యాణ్, చిరంజీవి, రామకృష్ణ, చందర్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

# యూనిట్ల అనుమతులు నిర్దిష్ట సమయంలోగా ఇవ్వాలి

**-డిమాండ్ బట్టి నైపుణ్య శిక్షణ**
**-టిజి ఐపాస్ కమిటీ సమావేశంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో యూనిట్ల స్థాపన అనుమతికై వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలు నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి టిజి ఐ పాస్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన 25 యూనిట్లకు సంబంధించి వివిధ రకాల 57 అనుమతుల విషయమై అభ్యంతరాలను శాఖల వారీగా కలెక్టర్ సమీ క్షించారు. గ్రానైట్, రైస్‌మిల్లులు, క్రూడ్ పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర యూనిట్లకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు వనరులు ఉన్నాయన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక ఔత్సాహికులకు అన్ని విధాలా సహాయ సహకరాలను అందించాలన్నారు. అనుమతులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వేగంగా ఇవ్వాలన్నారు. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే ఖమ్మం కేంద్ర బిందువు అవుతుందన్నారు. డిగ్రీ కళాశాల, ఐటిఐలలో పరిశ్రమల్లో డిమాండ్ ఉన్న కోర్సులకు సంబంధించి శిక్షణకు కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలలో ఏఏ పరిశ్రమలలో ఏఏ రకాల ఉపాధికి ఆస్కారం ఉన్నదో ఆ దిశగా మానవ వనరులను తీర్చిదిద్దాలన్నారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల జిఎం సీతారాం, ఏడి మైన్స్ సాయినాథ్, ఆర్టీవో వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరాం, వివిధ శాఖల అధికారులు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్, ప్రధాన కార్యదర్శి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/కల్లూరు:** 20వ తేదీ జిల్లా మున్సిపాలిటీ మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖమ్మం కార్పొరేటర్ బిజీ క్లె మెంట్ మున్సిపాలిటీ కార్మికులను మంగళవారం కోరారు. ఖమ్మంలో 20వ తేదీ శనివారం జరిగే మహాసభ సందర్భంగా కల్లూరు లో జరిగిన మున్సిపాలిటీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఏఐటీయూసీ ముందు బాగాన ఉండి పోరాటం చేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ కట్టడానికి భవిష్యత్తు పోరాటాల రూపకల్పనకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవటానికి ఈ మూడవ మహాసభ జరుగుతుందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి హక్కులు సాధించడానికి అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు చేయడానికి ఈ మహాసభ వేదిక కానుందని వివరించారు.




మహాసభను జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు లతోపాటు మున్సిపాలిటీ కార్మికులు ఓడల కృష్ణ , చింత పంటి శ్రీను తదితర కార్మికులు పాల్గొన్నారు.

# మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

**-కెయు పరీక్షల నియంత్రణ అధికారి రాజేందర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పరీక్షల నిర్వహణలో నిబంధనలు పాటించాలని మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని కాకతీయ విశ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి కె. రాజేందర్ తెలిపారు. మంగళవారం నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్‌డి ఎల్‌సి దూరవిద్య డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపీయింగ్‌కు తావులేకుండా సిబ్బంది, అధ్యాపకులు సమన్వయంతో పని చేస్తూ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు పరీక్షల నిర్వహణ అధికారి ఎస్. నర్సింహాచారి, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డిన్ పి. వరలక్ష్మి , కెయు క్యాంపస్



కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి. అమరవేణి, శంకర్, పిజి కళాశాల ప్రిన్సిపాల్ డా॥సిహెచ్ రవికుమార్, ఎకనామిక్స్ హెచ్‌వోడి డా॥ శ్యాంబాబు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన కార్ స్టాండ్ డ్రైవర్లు, ఓనర్లు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క క్యాంపు కార్యాలయం వద్దనున్న కార్ స్టాండ్ డ్రైవర్లు, ఓనర్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, పట్టణ ఎఐటీయూసి అధ్యక్షులు షేక్.బాజీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సమక్షంలో కార్ స్టాండ్ డ్రైవర్లు, ఓనర్లు సుమారు 70మంది పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. డ్రైవర్లకు కారు ఓనర్ల సమస్యలు పరిష్కరించడానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముందుగా కార్ స్టాండ్ పార్కింగ్ వద్ద యూనియర్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త వేసినందుకు ఐదువేల జరిమానా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోడ్డుపై చెత్త వేసినందుకు టెంట్ హౌజ్ యజమానికి ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు ఐదువేల జరిమానా విధించారు. మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 32వ డివిజన్‌లో జ్యోతి టెంట్ హౌజ్ యజమాని రోడ్డు మీద చెత్త వేయడాన్ని గమనించిన అధికారులు ఐదువేల జరిమానా విధించారు.



# ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మాతంగి రత్నం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బైరవునిపల్లి ఆటో అడ్డా యూనియన్ అధ్యక్షుడుగా మాతంగి రత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో నూతన కార్యవర్గం ను ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడు గా మాతంగి రత్నం, ఉపాధ్యాక్షుడు గా అలవాల నరసింహారావు, కార్యదర్శి గా పోలంపల్లి గోపి, ప్రధాన కార్యదర్శి గా మాతంగి రాజేందర్, కోశాధికారిగా దున్న ప్రసాద్, గౌరవ సలహాదారుడు గోపి ఉపేందర్ రావు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడారు. ఆటో యూనియన్ సమస్యలను సాధించేందుక ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతీ ఆటో కార్మికుడు యూనియన్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** క్రీడలను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని కాంగ్రెస్ మండల నాయకులు గుండా బ్రహ్మం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గౌతమి పాఠశాల విద్యార్థులకు దసరా సందర్భంగా విద్యార్థులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన క్రీడా కిట్స్ ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ ను వెలికి తీసేందుకు అవసరమైన పోటీలకు మంత్రి శ్రీనివాసరెడ్డి సహకరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వంతో పాటు ట్రస్టు ద్వారా క్రీడలను ప్రోత్సాహిస్తున్నారని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మంత్రి కి రుణ పడి ఉన్నట్లు వారు తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంకన్న, కొండబాలరాంబాబు, అనంతు సత్యనారాయణ, కైలాసపు వెంకటేశ్వర్లు, మోర మల్లయ్య, బండి కరుణాకర్, వెంకటేష్, చంద్రగానీ విజయ్, గౌతమి పాఠశాల ప్రిన్సిపాల్ కనపర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు చక్రి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టిన ప్రతీబిడ్డకు పోషకాహారం అందించాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పుట్టిన ప్రతీ బిడ్డ కు పోషక ఆహారం ను అందించాలని ఏసీడీపీవో జె.రత్నకుమారి సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం రైతు వేదిక లో కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్ల కు మూడు రోజుల పాటు శిక్షణ శిభిరం ను నిర్వహించారు. మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పుట్టిన బిడ్డ కు మంచి పోషక ఆహారం చాలా అవసరం అన్నారు. బాల్య దశలోనే బిడ్డకు సరైన ఆహారం, విద్యా అభివృద్ధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రతీ బిడ్డ సమగ్రంగా ఎదగాలంటే మన వంతు కృషి చాలా అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల లో అందించే పథకాల గురించి ప్రతీ ఒక్కరికి వివరించాలని సూచించారు. కేంద్రాలను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ కె.రమాదేవి, వై.సువర్చల, పి.నాగమణి, కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి వివోఏల నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఇందిరా క్రాంతిపదం వివోఏ ల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) ఎన్నిక మంగళవారం జరిగింది. వేము నాగమణి (అధ్యక్షులు), కోనూరు నీలవేణి (కార్యదర్శి), ధోనిమల్లిక (ఉపాధ్యక్షులు), వెంకట్రావమ్మ (కోశాధికారి), కమిటీ నిర్వహణ అధికారి మాధవి, గౌరవ అధ్యక్షులుగా వేము రాంబాబు గౌరవ సలహాదారుగా దామాల దయాకర్ రావు లను, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పదివేల గౌరవ వేతనాన్ని అమలుపరచాలని గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని అర్హతను బట్టి పదోన్నతి కల్పించాలని తదితర డిమాండ్లతో దశలవారి ఆందోళన చేస్తామని తెలిపారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తి వేయాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని కల్లూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టు మిత్రులు మంగళవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వార్తా సేకరణలకు వెళ్లిన జర్నలిస్టులపై అక్రమ కేసులను బనాయించడం సక్రమం కాదని అక్రమ కేసులను ఎత్తివేయాలని అక్రమ కేసులను పెట్టడం బాధాకరమని ప్రజా సమస్యలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జర్నలిస్టుల బాధ్యత అని ప్రధాన రహదారిపై ర్యాలీతో వెళ్లి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండలం మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# మైనార్టీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి



- మహిళలు ఆర్థికాభివృద్ధికి దిశగా కృషి చేయాలి
- కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని
- 120 మందికి కుట్టు మిషన్లు పంపిణీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీవ ర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు చర్యలు చేపట్టాలని, వారి సంక్షేమకోసం ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు కోరారు. ముస్లీం మైనార్టీ కార్పోరేషన్, క్రిష్టియన్ మైనార్టీ కార్పోరేషన్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని 120మంది లబ్ధిదారులకు మంజూరైన కుట్టు మిషన్లు మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో అందిజేశారు. ఈ సంద ర్భంగా కూనంనేని మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని, ఆర్థికాభి వృద్ధి సాధించిన కుటుంబానికి ఆసరగా నిలవాలన్నారు. ప్రభుత్వాలు తరుచూ హామీలు ఇచ్చినప్పటికీ మైనార్టీల అభివృద్ధి కోసం సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీల పేదల కష్టాలు తగ్గించేలా చిన్న స్థాయి ఉపాధి సాధనాలు, ఆర్థిక ప్రోత్సాహం అందితేనే నిజమైన శక్తివంతమైన సమాజం నిర్మించవ చ్చన్నారు. మైనార్టీ సంస్థల ద్వారా పంపిణీ చేస్తున్న ఈ కుట్టుమిషన్లు స్వయం ఉపాధికి పునాది వేస్తాయని, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. మహిళలను, నిరుద్యోగ యువతను ప్రోత్స హించేందుకు, ఉపాధి పరికరాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, మైనార్టీ కార్పోరేషన్ ఈడీ సంజీవరావు, తహశీల్దార్ పుల్లయ్య, నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, పలువురు మాజీ కౌన్సిలర్లు తది తరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో పోడు భూములు సాధించుకుందాం

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దున్నేవాడికే భూమి కావాలని భారత కమ్యూ నిస్టు పార్టీ నిర్వహించిన పోరాటం ఫలితంగా భారతదేశంలో లక్షలాది ఎకరాల భూములు పేదలకు దక్కాయని, అదే పోరాట స్ఫూర్తితో తెలం గాణ సాయుధ పోరాటం నిర్వహించి పేదలకు భూములు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి ఉందని, అట్టి పోరాట స్ఫూర్తితో పోడు భూములు, పోడు భూములకు పట్టాలు వచ్చేవరకు పోరాటం కొనసాగిద్దామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారో త్సవాల్లో భాగంగా చెరుకుపల్లి లో గద్దం కృష్ణయ్య అధ్యక్షతన మంగళ వారం జరిగిన సమావేశంలో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ చెరుకుపల్లి తుమ్మల నగర్ లో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పోరాట ఫలితంగా పేదలకు ఇళ్ల స్థలాలు దక్కాయని, అట్టి స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైతే ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఫారెస్ట్ అధికారులు గిరిజన ప్రజల పట్ల మంచి మనసుతో ఆలోచించా లని, వారు ఇల్లు కట్టుకునే అవకాశం ఇవ్వాలని లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, మహిళా సమైక్య రాష్ట్ర నాయ కులు పోటు కళావతి, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, టౌన్ కార్యదర్శి నిమ్మటూరు రామకృష్ణ, పాలకుర్తి వీరయ్య, గద్దం కృష్ణయ్య, తాటి రాజులు, తాటి కుమారి, ధారా రాజులు, తాటి రాజమ్మ, సులో చన, రాజమ్మ, సీతారాములు, తాటి ప్రసాదు, తాటి పవన్ కుమార్, శంకర్, రాంబాబు, నరేష్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ వర్కర్స్ సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు



**ప్రజాపక్షం/దమ్మపేట:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న సమ్మెకు అండగా బీఆర్ఎస్ నిలిచింది. వర్కర్లను పర్మినెంట్ చేయాలని, పాత పద్ధతిలోనే జిల్లా కలె క్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని,పెండింగ్ లో ఉన్న వేత నాలు చెల్లించాలని,కొత్త మెనూ వల్ల పెరిగిన పనిభారానికి అనుగు ణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని అనేక మార్లు స్థానిక ఎమ్మెల్యే నుంచి మంత్రుల వరకు వెళ్లి కోరినా స్పందించకపోవడంతో సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మెలు చేస్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పార్కలగండి,అంకంపాలెం, పెద్దగొల్లగూడెం, చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలల వద్ద సమ్మెలు చేస్తున్న క్రమంలో పార్కలగండిలో అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్, నాయకులు మిగిలిన సమ్మె జరుగుతున్న శిబిరాల వద్దకు వెళ్ళి డైలీవెజ్ వర్కర్స్ కి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దొడ్డా రమేష్, దారా యుగంధర్, రావుల శ్రీను, జలగం వాసు, సోడెం గంగరాజు, రెడ్డిమల్ల నాగయ్య, మొగిలి కృష్ణ, వెంపటి భరత్, మల్లేష్, కాక శంకర్ ప్రసాద్, నరేంద్ర, రంగ, వెంకటేశ్వరరావు, భీమా రాజు, సూరి చలపతిరావు, మాజీ ఎంపీటీసీ కొర్సా శ్రీను, మాజీ సర్పంచ్ కొర్సా వెంకటేశ్వర రావు, పూనేం గోపాల రావు, మొడియం సమ్మె, వాడపల్లి ఆనంద్ రావు తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో సత్తుపల్లి నుండి కాక ర్లపల్లి వైపు వెళ్తున్న కారు, కాకర్లపల్లి నుండి సత్తుపల్లి వైపు వస్తున్న ఆటో ఎదు రుగా ఢీకొన్న ఘటనలో సత్తుపల్లి మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన మాదుగుల సతీష్ (25) కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా ఈఎంటి (ఎమ ర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) గొల్లమందల కృష్ణ, పైలెట్ రాజులపాటి రాధాకృష్ణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా మండల పరిధిలోని మేడిశెట్టి వారి పాలెం అడ్డరోడ్డు, గంగారం మధ్యలో రాత్రి 12 గంటల సమయంలో రెండు బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రం, చింతలపూడి మండలం, సీతానగరం గ్రామానికి చెందిన దుర్గాప్ర సాద్ సత్తుపల్లి నుండి సీతానగరం వెళ తుండగా.. చింతలపూడి నుండి సత్తుపల్లి వైపు వస్తున్న వ్యక్తిని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు పాలైన దుర్గాప్రసాద్ ను స్థాని కులు 108 కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న 108 ఎమ ర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలెట్ రాధాకృష్ణ క్షత గాత్రుడి కుడికాలు వేలు విరిగి, తలకు బలమైన గాయమై, రక్తస్రావం జరుగుతుండగా హుటాహుటిన ప్రథమచికిత్స అందించి సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వేర్వేరు ప్రమాదాలపై పోలీ సులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

# 19న జరిగే ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** యాజమాన్యం అవలం బిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 19 న కొత్తగూడెంలోని జిఎం కార్యాలయం నందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు ఏఐటియూసి నాయకులు. మంగళవారం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియూసి ఆధ్వ ర్యంలో సత్తుపల్లి జెవిఆర్ (సమంత) పిట్ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహిం చారు. ఈ మీటింగ్ కి ముఖ్య అతిథులుగా ఏఐటియూసి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి వీర స్వామి, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్లు హాజరై మాట్లాడారు. సిఅండ్ఎండి తో జరి గిన స్ట్రక్చర్ కమిటీ సమావేశం లో ఒప్పుకున్న కార్మికుల సమస్యలపై వెంటనే సర్క్యులర్ విదు దల చెయ్యాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2024 2025 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి దానిలో 35%శాతం లాభాల వాటా కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఈ నెల 19 న జిఎం ఆఫీస్ ముందు తలపెట్టిన మహాధర్నాలో సత్తుపల్లి జెవిఆర్ నుండి కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో జేవీఆర్ ఓసి జాయింట్ కార్యదర్శి ఆర్.భరణి, జెవిఆర్ ఓసి పిట్ కార్యదర్శి నర్సింహా రావు, సీనియర్ నాయకులు బి.సుధాకర్, ఏసుపాదం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో క్షుద్ర పూజలు కలకలం



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం గణేష్ పాడు ప్రైమరీ స్కూల్లో క్షుద్ర పూజలు కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల నుంచి పాఠశాలలో తరగతి గది ముందు యథావిధిగా క్షుద్ర పూజలు చేస్తున్నారు అని తెలిపారు. ఈ సంఘటనతో పాఠశాలకు రావాలి అంటేనే విద్యార్థులు భయాందోళనలో ఉంటున్నారు అని విద్యార్థుల తల్లి దండ్రులు గ్రామస్తులు తెలిపారు.

# స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్ వెస్లీకి సన్మానం



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాల రీస్ మణుగూరు ఏరియా స్పోర్ట్స్ సూపర్వై జర్ జాన్ వెస్లీకి గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటి యుసి) ఇల్లందు బ్రాంచ్ తరుపున సిఈఆర్ క్లబ్ నందు శాలువాతో సన్మానించడం జరి గింది. ఈ సందర్భంగా ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ ఎండి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్ వెస్లీ సుదీర్ఘకాలంగా సింగరేణి క్రీడా విభాగానికి విశేష సేవలు అందిస్తున్నారని అనేక మంది క్రీడాకారులను తయారు చేశారని, వారి ఆధ్వర్యంలో సింగరేణికి కోల్ ఇండియా, పబ్లిక్ సెక్టార్లలో విజయాలు సాధించి పెట్టారన్నారు. అంకిత భావం, ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి కలిగిన జాన్ వెస్లీ ని సింగరేణి క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమణుగూరు ఏరియా జీఎం కమిటీ సభ్యులు ఆవుల నాగరాజు, ఇల్లందు పిట్ కార్యదర్శులు నూనె శ్రీనివాస్, బానోత్ బాలాజీ, ఎండీ షబ్బీర్, రాకేష్, ప్రవీణ్ కుమార్, కామరాజు, గూడూరు కృష్ణ, ఆర్ శ్రీనివాస్, ఆదేపు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు చక్రాల సైకిల్ వితరణ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఆర్ డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాచందన స్ఫూర్తితో దివ్యాంగులకు తన వంతు సహాయం చేస్తున్నట్లు జోనెబోయిన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు అన్నపూర్ణ తెలిపారు. పెనుబల్లి మండల కేంద్రంలో భవన్నపాలెం గ్రామానికి చెందిన కుంచం వెంకట కృష్ణ 5 నెలల క్రితం మధిర రైల్వే స్టేషన్ లో ట్రైన్ ఎక్కుతూ కిందపడి తీవ్రగాయాలు అవ్వగా ఒక కాలును పూర్తిగా తొలగించారు. నడవలేని స్థితిలో ఉన్న తనకి జోనెబోయిన చారిటబుల్ ట్రస్ట్ నుండి 12 వేల రూపాయల విలువైన ట్రై సైకిల్ ను అన్నపూర్ణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1998 సంవత్సర కాలంలో తాను స్కూల్ కి వెళ్లలేక నడవలేని స్థితిలో ఇంట్లో ఉన్న సమయంలో అప్పటి పెనుబల్లి ఎంపిడిఓ గా ఉన్న విద్యా చందన స్కూల్ కి వెళ్లాలి అనే నా కోరికను గుర్తించి ట్రై సైకిల్ ను ఇప్పించారని ఆమె ఇచ్చిన ట్రై సైకిల్ పై వెళ్లి డిగ్రీ వరకు పూర్తి చేసి, ఉద్యోగం సంపాదించి నాలాగా ఇబ్బంది పడుతున్న పేద దివ్యాంగులకు 10 మందికి ట్రై సైకిల్స్, 12 మందికి వీల్ చైర్స్ అందించినట్లు తెలిపారు. ట్రై సైకిల్ అందచేసిన కార్యక్రమంలో చెలికాని నీలాద్రి బాబు, చెక్కిలాల రమేష్, సూరా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తి వేయాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** జర్నలిస్ట్లపై అక్రమ కేసులను ఎత్తి వేయాలని, జర్నలిస్ట్లు రాసే వార్త లు నచ్చక పోతే కేసులు పెడతారా అని జర్నలిస్ట్ లు ప్రశ్నిస్తున్నారు. కౌంజిర్లలో జర్నలిస్ట్ లపై పోలీసులు పెట్టిన కేసులు ఎత్తి వేయాలని కోరు తూ పెనుబల్లి మండల ప్రెస్ క్లబ్ తరుపున పెను బల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లమల ప్రతాప్ ఆధ్వ ర్యంలో మంగళవారం పెనుబల్లి తహశీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల జర్నలిస్ట్ మిత్రులు వేముల రవి, బాజీ, కిరణ్, అశోక్, మీరా పాల్గొన్నారు.

# ఉద్యమానికి ఊపిరులూదిన బ్రాహ్మణపల్లి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సాయుధ తెలంగాణ పోరాటంలో బ్రాహ్మణపల్లి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉన్నది. బోనకల్ మండలంలో గల బ్రాహ్మణపల్లికి చెందిన అనేక మంది సాయుధ తెలంగాణ పోరాటంలో కీలక భూమిక పోషించడమే కాకుండా ఈ గ్రామం తెలంగాణ ఉద్యమ కేంద్రంగా పని చేసింది. తెలంగాణ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన అప్పటి ఆంధ్ర మహాసభ నేత రావి నారాయణ రెడ్డి ఈ గ్రామాన్ని పలుమార్లు సందర్శించి ఉద్యమాన్ని ముందుకు నడిపేందుకు కృషి చేశారు. రావి నారాయణరెడ్డి అజ్ఞాత కాలంలో ఈ గ్రామంలోనే పలుమార్లు తలదాచుకున్నారు. ఉద్యమానికి నేతృత్వం వహించిన చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి అనేక మంది ఆనాటి నాయకులు ఈ గ్రామం కేంద్రంగా ఉద్యమాన్ని నడిపించారు. గ్రామం మొత్తం సాయుధ పోరాటానికి దన్నుగా నిలవడం పక్కనే గల మల్లారం ఆంధ్రా ప్రాంతంలో ఉండటం బ్రాహ్మణపల్లి పోరాట కేంద్రంగా పని చేయడానికి కారణమైంది. గ్రామానికి చెందిన పలువురు అమరులయ్యారు. నల్లమల గోపయ్య అనే సాయుధ పోరాట యోధున్ని అప్పటి నిజాం రక్కసి మూకలు హతమార్చిన తీరు అప్పట్లో కథలు కథలుగా చెప్పుకునేవారు. పోలీసులకు పట్టుబడిన నల్లమల గోపయ్యను దళ రహస్యాలు చెప్పమని నాయకుల జాడ కోసం హింసిస్తూ శరీరం నుండి రోజుకో భాగాన్ని తొలగిస్తూ అంతం చేశారని సమాచారం. గాదె మాధవరెడ్డిది కూడా అదే పరిస్థితి. సాయుధ పోరాటంలో పాల్గొన్న ఆయనను వంచించి పిలిచి చాటు నుండి దెబ్బతీశారని చెబుతుంటారు. ఈ గ్రామానికే చెందిన గాదె నారాయణరెడ్డి, పైడిపల్లి జోగయ్య, గాదె పిచ్చిరెడ్డి, కొంగర అచ్చయ్య తదితరులు సాయుధ పోరాటంలో ప్రజల పక్షాన పోరాడి అశువులు బాశారు. ఈ గ్రామానికి చెందిన పారుపల్లి పుల్లయ్య అప్పటి సాయుధ పోరాటంలో పాల్గొని ఆ తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా నేతగా ఎదిగారు. పారుపల్లి చిన్నకోటయ్య, మందడపు నారాయణ, రాజారత్నం, పట్టాభి రామయ్య ఇలా అనేక మంది ఆనాడు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సాయుధ పోరాట కాలంలో దళాలకు సమాచారం ఇచ్చే కొరియర్‌గా పనిచేసిన కొంగర అప్పయ్య ఆతర్వాత కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఎదిగి మూడున్నర దశాబ్దాల పాటు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ఆయన సర్పంచ్‌గానే పనిచేస్తూ తుదిశ్వాస విడవటం శోచనీయం. ఇప్పటికీ చైతన్యానికి ప్రతీకగా నిలిచే గ్రామం బ్రాహ్మణపల్లి. సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా ఈ గ్రామంలో రైతాంగ పోరాటంలో అమరులైన వారి స్థూపం వద్ద పూలమాలలు వేసి గ్రామస్తులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు స్మరించుకుంటారు.

# పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పారిశుధ్య పనులను ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 36, 46, 48, 55 డివిజన్లలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. ఆయా డివిజన్లలో సిబ్బంది ఎంత మంది హాజరయ్యారు వాటి అటెండెన్స్‌ను కమిషనర్ పరిశీలించారు. విధులకు ఎక్కువ కాలం రాకుండా ఉండే సిబ్బంది గురించి ఆరా తీశారు. సిబ్బంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారనేది డివిజన్ల వారీగా పరిశీలించారు. 36వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడారు. చెత్త ఆటో, ట్రాక్టర్ ప్రతి రోజు వస్తుందా, రోడ్లు, కాలువలను శుభ్రం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని డివైడర్ల మెయింటినెన్స్ పరిశీలించారు. రోజు వారి శుభ్రత పనులు జరుగుతున్నాయా అని అధికారులను ప్రశ్నించారు. స్వీపింగ్ మిషన్లు ఎక్కడెక్కడ పనిచేసింది, శుభ్రం చేసిన ప్రదేశాలను తనిఖీ చేశారు. జటాయు వాహనం పనిచేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి ఎక్కడెక్కడ పనిచేసిందో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు స్వీపింగ్ మిషన్‌తో మెయిన్ రోడ్లు పూర్తిగా శుభ్రం చేయాలన్నారు. శానిటరి అధికారులు సమన్వయంతో రోడ్లపై చెత్త లేకుండా పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు.

# వైరా మున్సిపాలిటీలో పర్యటించిన అదనపు కలెక్టర్ శ్రీజ

**-పల్లిపాడు సమీపంలో డంపింగ్‌యార్డ్‌కు 1.36 కుంటల స్థల సమీకరణ**
**-వ్యర్థాలు డంప్ పట్ల ఆగ్రహం**





**ప్రజాపక్షం/వైరా:** అదనపు కలెక్టర్ వైరా మున్సిపాల్ ప్రత్యేక అధికారిని శ్రీజ మంగళవారం వైరా మున్సిపాలిటీలో పర్యటించారు. వైరా మున్సిపాలిటీకి ప్రతిష్టాత్మకంగా మారిన డంపింగ్‌యార్డ్ సమస్యను కొలిక్కి తీసుకొచ్చినట్లు సమాచారం. మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు కోసం వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు, తల్లాడ తహశీల్దార్ సురేష్, కొణిజర్ల తహశబుల్దార్ అరుణ, మున్సిపాల్ కమీషనర్ గురులింగంతో కలిసి ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించారు. వైరా రిజర్వాయర్ వద్ద తల్లాడ మండలం రెడ్డిగూడెం రెవిన్యూలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించి ఆ ప్రాంతం వాహనాలు అనుకూలంగా ఉండదని వైరా నది ప్రవహిస్తుంటే వాహనాలు ఎలా వెళతాయని ఇది అనుకూలంగా లేదని తెలిపారు. వైరా నది ప్రక్కన అస్తవ్యస్థంగా డంపింగడ్ చేసిన వ్యర్థపదార్థాల్లో నుంచి వస్తున్న దుర్వాసన గమనించిన శ్రీజ ఇలా వ్యర్థపదార్థాలు ఇష్టానుసారంగా డంప్ చేస్తే క్రింద ప్రజలు ఇబ్బంది పడతారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతానికి వెళ్లగానే దుర్వాసన రావడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా వైరా మున్సిపాల్ కార్యాలయం ప్రక్కన ఉన్న హరిత భవనం నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన అదనపు కలెక్టర్ శ్రీజ ఎందుకు నిరుపయోగంగా ఉంచుతుఆన్నరని వివరాలను అడిగి తెలుసుకొని వాడుకలోకి తేవాలని ఆదేశించారు. వైరాకి ప్రభుత్వ పెట్రోల్ బంక్ మంజూరైందని, దానికి సంబంధించిన స్థల సేకరణ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. పల్లిపాడు సమీపంలో సుమారు ఎకరం 36 కుంటల స్థలాన్ని డంపింగ్‌యార్డ్‌కు అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారించి కేటాయించినట్లు సమాచారం. డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు కావాల్సిన క్లియరెన్స్ రాగానే వైరా మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డ్ సమితి తీరిపోనుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సనద్ధం కావాలి



**ప్రజాపక్షం/వైరా:** స్థానిక ప్రజా సమస్యలను పరిష్కారం కోసం నిరంతరం ఆందళన పోరాటాలు నిర్వహించాలని, నిరంతరం అభివృద్ధి చెందుతున్న వైరా నియోజకవర్గ కేంద్రంలో ప్రధానమైన మౌళిక సదుపాయాలు కూడా ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక బోడేపూడి భవనంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శుల సమావేశం బొంతు సమత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలో పార్టీ నిర్వహించిన సర్వే కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కారం కోసం ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు మచ్చా మణి, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి నరసయ్య, అనుమోలు రామారావు, కామినేని రవి, రాచబంటి బత్తిరన్న, షేక్ నాగుల్‌పాషా, తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఈనెల 22 నుంచి 29 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్, ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని సిపి తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, ర్యాలీలు, మైకులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు.

# ట్రేడ్ లైసెన్స్‌పై దృష్టి సారించండి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ట్రేడ్ లైసెన్స్‌లు పొందని వారిని గుర్తించి లైసెన్స్‌లు పొందేలా వార్డు ఆఫీసర్లు తగు చర్యలు తీసుకోవాలని ఖమ్మం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం రెవెన్యూ ఆఫీసర్, శానిటరీ సూపర్ వైజర్ తో కలిసి వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డు ఆఫీసర్ తమకు కేటాయించిన డివిజన్లలో ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల ప్రక్రియను సక్రమంగా అమలుచేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకున్న వారు ఎంత మంది, ఇంకా లైసెన్స్ తీసుకోని వారు డివిజన్లలో ఎంత మంది ఉన్నారో గుర్తించాలన్నారు. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.

# విధుల్లో చేరిన జిపిఓలు



**ప్రజాపక్షం/కల్లూరు:** రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జిపిఓ లుగా నియామక పత్రాలను అందుకున్న సిబ్బంది మంగళవారం విధుల్లో చేరారు. ప్రభు త్వం అందించిన అనుమతి పత్రాలను తహ శీల్దార్ కు అందించారు. మండలాన్ని 10 క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్ కు ఒక అధికారిని నియమిస్తూ ప్రభుత్వ ఆదేశాలతో వారు మంగళవారం ఆయా గ్రామాలలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని రెవెన్యూ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పరిషత్ కార్యాలయం నందు అడిషనల్ డిఎంహెచ్ వో వెంకటరమణ, ఎంపిడివో సక్రియతో కలిసి మండలంలో డెంగ్యూ, మలేరియా కంట్రోల్‌తో పాటు లార్వా గ్రామాల్లో రేషన్ చేయడం వాటిపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల సెక్రటరీలు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై, వ్యాధులు ప్రబలకుంగా ఉండేందుకు చర్యలు తీసుకునే విధంగా చేపట్టాలని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు వృద్ధి చెందకుండా లార్వా ఆరేషన్ చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సోమవరం పిహెచ్‌సి మెడికల్ అధికారి డాక్టర్ హర్ష, ఏఎంవో వెంకట్రావు యాదవ్, డిపిఎంవో శాస్త్రి, హెచ్ ఈవో నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోకో క్రీడలో గురుదేవ్ విద్యార్థిని ప్రతిభ



**ప్రజాపక్షం/చర్ల :** స్థానిక గురుదేవ్ విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని సిహెచ్ అన్విత కోకో క్రీడలో ప్రతిభ కనపరిచి జిల్లాస్థాయి క్రీడలకు ఎన్నికైంది. ఈ మేరకు ఎంఇఓ పరిటాల వెంకట రమణ విద్యార్థినీని అభినందించారు. పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయులు సైతం విద్యార్థినీని అభినందించారు. రాబోయో రోజుల్లో మరిన్న విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# శంభునిగూడెంలో ఉచిత వైద్యశిబిరం



**ప్రజాపక్షం /గుండాల :** మండల పరిదిలోని శంభుని గూడెం గ్రామంలో ఉచిత వైద్య శిభిరంతోపాటు , వైద్యపరీక్షలు నిర్వహించినట్లు గుండాల ప్రాథమిక వైద్యులు సుదీప్ కుమార్ తెలిపారు. మంగళ వారం ఆగ్రామంలో వైద్యశిభిరాని విచ్చేసిన రోగులకు వైద్యపరీక్షలు బిపి, షుగర్, మరియి టిబి సరీక్షలకోసం ఎక్స్‌రే తీయడం జరిగిందన్నారు. టీబి ఎటాక్ అయున వారిని గుర్తించి ప్రత్యేకమైన మందులను అందిస్తామన్నారు. అలాగే బిపి, షుగర్ ఉన్న వారికి అక్కడే మందులను అందచేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా వర్షాకాల సీజన్ పరిసరాల పరిశుభ్రతను విదిగా పాటిచాలని, దోమల నివారణ విషయంలో పరిసరాల్లో నీటినిలువలు ఉండ కుండ ప్రతి ఒక్కరు జాగ్రతలను పాటిచాలని సూచించారు. కార్యక్రమంలో టిబి టెక్నిషయన్ ఎంఎల్‌హెచ్‌పి ప్రియాంక, ఎంపిఎచ్‌ఏ అరుణకుమారి, హెచ్‌ఏ బిక్షా, ఆశాలు, లక్ష్మి , వసంత, , సూరమ్మ, సమ్మక్క, నాగమణి పాల్గొన్నారు.